


# కొంపెల్ల విశ్వం • బచ్చీ బీమార్ హోగయా...

నేను పరమదౌర్భాగ్యుణ్ణి. నాకు లేని దురల వాటులేదు. తాగుతాను-సిగరెట్లూ, మందూ. పేకాడతాను-డబ్బుతోటే, మా ఆవిడ నగలతోటే. 'ఆరకం' అమ్మాయిలు కనిపిస్తే వాళ్లతో పోతాను మా ఆవిడ వూరిలో లేనప్పుడూ, ఆవిడ వొందు బోరుకొట్టినపుడూ. నేనుసంపాదించే డబ్బుతో ముందునాసుఖం, ఆ తర్వాత ఏమన్నా మిగిలితే ఇంట్లోవాళ్ల సుఖం. జాలి, దయ, మానవత్వం, కరుణ, న్యాయం, ధర్మం -ఇలాంటి వాటికి నా మనసులో చోటు లేదు. అంతెందుకు-నాకు మనసే లేదు. అంతేకాదు-మనుషులందరికీ మనసుంటుందనే నమ్మకం కూడా లేదు.

❁ ❁ ❁

సాయంత్రం అయిదయింది. మేం అంతా నాలుగున్నరకే పెన్నులు మూసేసి, మొహాలు కడుక్కొని, జుట్టు సవరించుకుంటాం. అయిదయింది. కాబట్టి రోడ్డు మీద పడ్డాం. మా చుట్టు పక్కల అయిదారు ఆఫీసులు వున్నాయి, వాటిల్లోంచి కూడా జనం బిల బిలమంటూ రోడ్డు మీదకు వచ్చారు. వాళ్లలో కిల కిల మంటున్న ఆడ జనం కూడా వున్నారు. కాసేపు ఇంగ్లీషులోనూ, కాసేపు ఉర్దూలోనూ, తెలుగులోనూ, ఇంకాసేపు తెలుగింగ్లీషులోనూ మాట్లాడే ఆడపిల్లల మాటలు —నిజం చెప్పాలంటే నాకు ఒక్కముక్క కూడా అర్థం కావు. కనీసం అవి వాళ్లకేనా అర్థమవుతాయా అనినా అనుమానం. అయితే నాకు పద్మలత మాటలు మాత్రం బ్రహ్మాండంగా అర్థమవుతాయి. పద్మలత ఏమీ తోచక స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తోంది.

పద్మలత నవ్వితే అచ్చమైన ఆడపిల్లనవ్వినట్టుంది. పద్మలత మాట్లాడితే అందమైన ఆడపిల్ల మాట్లాడినట్టుంటుంది. పద్మలత నడిస్తే నూటికి నూరుపాళ్లు తెలుగమ్మాయి నడిచినట్టు నడుస్తుంది. అవును! పద్మలత పెరఫెక్ట్ ఆడది, ఆమెతో నా సంబంధం—నాలుగేళ్ల పాతది. నిజంగా నిజం చెప్పాలంటే పద్మలాంటి అందమైన ఆడదానికి 'ఆ బుద్ధి' వుండడం నాలాటి మగవాళ్ల అదృష్టం.

పద్మలత నాన్న సంఘంలో పలుకుబడి గల మనిషి. ఆయనకి డాబు, బంగళాతో బాటు ఇంకా చాల హోదాలున్నాయి. అన్నట్టు—పద్మలత మొగుడు కూడా మంచి ఆస్తిపరుడే. అందంగా, మందంగా, డిగ్నిఫైడ్‌గా వుంటాడతను, కానీ పద్మలత అత

నితో ఉండడంకన్నా, నాతో ఉండడమే ఇష్టపడుతుంది. కొడుకుని కూడా నాకేశంది. పద్మలత కొడుకు నల్లగా, తుమ్మమొద్దులా అచ్చు నాకు మల్లేనే వుంటాడు. వాడంటే పద్మలతకి ప్రాణం. ముందే చెప్పానుగా— నాకు అటువంటి చచ్చుసెంటిమెంట్లు లేవని.

“ఎందుకు కబురు చేశావు?” అడిగాను పద్మలతని సమీపించి.

“ఎల్లుండి ఒకసారి మా యింటికి రండి. ఆయనకి మీతోపనివుందట.” నాతో చెప్పేసి. కారులో కూచుని వెళ్లిపోయిందామె.

పద్మలత ఎప్పుడూ అంతే! బైటనాతో ఎక్కువగా మాట్లాడదు. వాళ్ల యింటికి వెడితే, నన్ను ఎక్కువగా మాట్లానీయదు. ఎల్లుండి నన్ను వాళ్లయింటికి రమ్మందంటే ఆమె తప్ప మరెవరూ ఆ రోజు ఇంట్లోవుండడం లేదన్నమాట!

‘నా బెడ్‌రూంలో వున్న నిలువుటద్దాలకు తప్ప మనసోగసూ వయసూ మరెవరికీ తెలియడానికి వీల్లేదు’ అంటుంది పద్మలత. ఎంత చిత్రమైన మనిషి!

బస్టాండు కొచ్చాను. మా జనాలు చాలామంది వెళ్ళిపోయారు చంద్రశేఖరం, రాజారావు మాత్రం వున్నారు. నేను వాళ్ల దగ్గిర కెళ్ళి సిగరెట్టు వెలిగించుకున్నాను. రాజారావు కబుర్లు మొదలుపెట్టాడు—నేను, శేఖరం వింటున్నాం.

“బచ్చీ బీమార్ హోగయీ. కుచ్ దేసక్తే...” ఈ మాటలు విని మేం ముగ్గురం అటువైపు చూశాం. ఓ ఆడమనిషి. వయసు 30 కి, 35 కి మధ్య వుంటుంది. శరీరం లోపెక్కినతర్వాత, ఏదైనా కారణం వల్ల మళ్లీ లావుతగ్గిపోతే మనుషులు ఎలా వుంటారో—సరిగ్గా అలాగే వుంది, ఆ మనిషి. చంద్రశేఖరం ఆమెకేసి హేళనగా చూశాడు. రాజారావు వెలికిగా నవ్వాడు. నేను ఆమె కేసిచూడ్డం మానేసి, చేత్తో ఏమీ లేదనట్టు సైగ చేశాను. మా దగ్గిర్నుంచి వెళ్ళిపోయి, పక్కవాళ్లని అడుగుతోంది, మళ్ళీ అలాగే—

“బచ్చీ బీమార్ హోగయీ...కుచ్ దేసక్తే”.

“నువ్వు ఇక్కడికూడా వచ్చావా?” అన్నాడొకడు ఉర్దూలో.

“రెండేసి గంటల చొప్పున ఒక్కొక్క బస్టాపులో ఆయిదారు ఏరియాలు తిరుగుతుంది” అన్నాడింకొకడు ఉర్దూలోనే. వాళ్లు హేళనగా మాట్లాడడం చూసి, మరొకరి దగ్గిరకి కదిలిందామె.

“అది నాకు నాలుగు సంవత్సరాలనుంచీ తెలుసు. అప్పట్నుంచీ అదే పాట—కూతురికి జబ్బు అంటుంది. ఇంకా తగ్గలేదంటావా?” అడిగాడు రాజారావు.

“మొన్నటిదాకా చార్మినార్ బస్టాపుదగ్గిర చూశాను. ఇప్పుడు ఏరియా మార్చినట్టుంది” అన్నాడు చంద్రశేఖరం.

“సీజనల్‌గా ఏరియాలు మారుస్తుందన్నమాట” అన్నాను నివ్వు మానేను.

“ఏడిసింది. పగలు ఈ బిజినెస్సూ, రాత్రి ఆ బిజినెస్సూ”

“నిజమా?”

“సర్లే, మనలాటి వాళ్లతో అయితే పరవాలేదు. మరీ లో క్లాసు వెధవలతో కదా”

—నాకు నవ్వొచ్చింది. రాజారావు క్లాసుల గురించి మాట్లాడుతున్నందుకు. నేనే అనుకుంటే, నాకంటె నికృష్టుడు రాజారావు

ముగ్గురికి కావలిసిన బస్సులు వచ్చేసరికి, ఎవరి దారి వాళ్ళు పట్టాం.

* * *

ఇంట్లో మా ఆవిడ రెడ్ సిగ్నల్ చూపించింది. గ్రీన్ సిగ్నల్ చూపడానికి మూడు రోజులు టైముంది. నా మనస్సేమో పిచ్చి పిచ్చిగా వుంది. ఇవాళ పద్మలతతో గడపడం అవుటాఫ్ క్వశ్చన్. వనజ సినీమా వెడతానని చెప్పింది. ఉమారాణి వాళ్ళ ఆఫీసరుతో కొడైకెనాల్ వెళ్ళింది

బుర్రలో ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపులో 'బచ్చీ బీమార్ హోగయీ కుఛ్ దేసక్తే.' మనిషి కనిపించింది. టైము ఏడున్నరయింది. నేను విన్నదే నిజమైతే మరో అరగంట ఆమె మా ఆఫీసు ఏరియాలోనే వుంటుంది.

ఆటో ఎక్కాను ఆఫీసు బస్టాపుదగ్గర దిగాను. ఆమెకనిపించింది. దగ్గరగా వెళ్ళి నించున్నాను ఆమె అడిగింది — "బచ్చీ బీమార్ హోగయీ. కుఛ్ దేసక్తే''

జేబులోంచి రూపాయి నోటు తీసి యిస్తూ మెల్లగాఅడిగాను ఉర్దూలో "నీఇల్లెక్కడ?''

ఓ సారి అదోలా చూసి అంది ఉర్దూలోనే "పదండి. రిక్షాలో వెడదాం''

కాస్త అటూ ఇటూగా నడిచి ఇద్దరం రిక్షా ఎక్కాం—

హైదరాబాద్‌లో అలాంటి గుడిసెలు కూడా వుంటాయని అప్పుడే తెలుసుకున్నాను. లోపలికెళ్లాం. ఓ పక్క ఓ చింకి మంచం. దానిపైన కదల్లేని స్థితిలో ఓ అయిదేళ్ల పిల్ల. మంచం పక్కనే ముగ్గుబుట్ట లాంటి తలతో, పండుటాకులాంటి ముసల్ది. వెలుగుదామా, ఆరిపోదామా అంటూ వెలుగుతున్న దీపం.

పైసలు తీసుకెళ్ళి ముసల్దానికిస్తూ అడిగిందామె "ఎలావుంది?''

ముసల్ది ఏదో నాకు వినపడకుండా గొణికి, పైసల్తోసహా వీధిలో కెళ్ళిపోయింది. దీపాన్ని చంటిదాని కళ్లకి అడ్డంగాపెట్టి దాని వొంటి మీద చెయ్యివేసి చూసి దామె

ఆతర్వాత మొహమూ కాళ్లూకడుక్కొని, ఏదో బూడిదలాంటి పౌడరు పులుముకొని నా దగ్గరకు వస్తూ అంది "నా కూతురు. పుట్టినప్పటి నుంచీ రోగమే దానికోసమే ఈ తాపత్రయం.''

"పాపం'' అన్నాన్నేను. కానీ అది నా మనసులోంచి వచ్చిన మాట కాదు. ఆమెనిమంచిచేసుకోడానికి అన్నమాట ఆమె భుజం మీద చెయ్యి వేసి, నావైపునకు తిప్పుకున్నాను—

ఎందుకో కానీ సడన్‌గా నాకు పద్మలత గుర్తుకొచ్చింది. నాకు తెలీకుండానే పద్మలతనీ ఈమెనీ పోల్చడం మొదలుపెట్టింది మనస్సు ఇంద్రభవనం లాంటి ఆయిల్లు. పూరిపాకలాంటి ఈ యిల్లు ఖరీదైన సెంటు, అగరవొత్తుల గుబాళింపులు అక్కడ...

పద్మలతని తలచుకోవడం వల్లనేమో ఇంద్రియాలు బ్రహ్మాండంగా పని చేస్తున్నాయి. ఆమె కూడా మంచి రెస్పాన్సే యిస్తోంది. ఇక్కడ పట్టుపరుపు, మల్లెపూలు, సెంటు, అగరొత్తులు—ఇవేవీ లేవు. కానీ వాటన్నిటినీ మించిన కోరికవుంది. కోరిక లేనప్పుడు అవన్నీ వుండి మాత్రం ఏమిటి ప్రయోజనం? పద్మలతతో నాపొందుముందు ఇది దిగదుడుపే కావచ్చు. కానీ పద్మలత, ఇప్పుడు నేను అనుభవిస్తున్న మనిషి— ఇద్దరూ ఆడవాళ్లే. నాకి క్షణంలో కావల్సింది కూడా యిదే.

—ఇంతలో మంచం మీద పడుకున్న పిల్ల ఏడుపు లంకించుకుంది. "ఇప్పుడే వస్తాను. వదలండి" అందామె. నేను వొదల్లేదు. పిల్ల ఏడుపు తారాస్థాయి నందుకుంది—నా కోరికలాగ. ఎలాగైనా సరే, నన్ను వదిలించుకోవాలని ప్రయత్నించిందామె. కానీ నాశక్తిముందు ఓడిపోయింది. పిల్ల ఇంకా ఏడుస్తూనే వుంది. నేను చల్లబడ్డాను, అయినా ఆమెని వెంటనే వొదల్లేదు. ఆమెనే కాదు, నేను చల్లబడినా సరే, వెంటనే ఏ ఆడదాన్నీ వొదలను. ఆమెకున్న బలం అంతా ఉపయోగించి. నన్ను వదిలించుకుని బిడ్డ దగ్గరకు పరిగెత్తిందామె. బిడ్డ ఏడుస్తూనే వుంది ఆమె సముదాయించడానికి ప్రయత్నిస్తోంది. నేను లేచి, జేబులోంచి పది రూపాయలు తీసి ఆమె దగ్గర పెట్టి, గుడిసెలోంచి బైటకొచ్చాను. ముసల్ది సణుక్కుంటూ, తిట్టుకుంటూ లోపలికి పరిగెత్తింది.

—ఒక్కసారిగా ఆ పిల్ల ఏడుపు ఆగిపోయింది. నాకేదో అనుమానం వచ్చింది, అయినా వెనక్కి వెళ్లలేదు. ముందుకే నడిచాను—అవును! నాకు చచ్చు సెంటిమెంట్లు లేవు. దయా, దాక్షిణ్యం, కరుణా, న్యాయం, ధర్మం అసలేలేవు. అసలు మనసంటూ వుంటేగా, అవన్నీ వుండటానికి! దగ్గర్లో వున్న పాన్‌డబ్బాను సమీపించి, ఓ సిగరెట్టు వెలిగించుకున్నాను—

* * *

అమర్నాడే కాదు, మరెప్పుడూ హైదరాబాద్‌లో నాకు 'బచ్చీ బీమార్ హోగయా. చికుచ్ దేవక్తే మనిషి కనిపించలేదు. *